క్లుప్తంగా

అన్న సమారాధన



పామర్రు: స్థానిక వాసవీ శరణాలయంలోని వృద్ధులకు బుధవారం అన్న సమారాధన కార్యక్రమం దాతల సహకారంతో నిర్వహించారు. కొల్లిపర గ్రామస్తులు జొన్నల కిరణ్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన భార్య జొన్నల భవ్యరెడ్డి కుటుంబ సభ్యులు వృద్ధులకు అల్పాహారం, అన్నదానం చేశారు. అలాగే పండ్లు, స్వీట్లు, హాటులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత బంధువు దేవిరెడ్డి సుదర్శనరెడ్డి, శరణాలయ నిర్వాహకులు ఘంటసాల భరతుడు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీసమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏరాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామికి విశేష అలంకరణ చేశారు. ఆలయంలోని శివసాధంలో స్వామికి శాంతి కల్యాణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పర్యవేక్షణలో పూజలు చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో ఎం.గంగాధర రావు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలు గీతాలు అజరామరం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు పద్మశ్రీ డాక్టర్ శ్రీపాద పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాలు) స్వరం చిరస్మరణీయమని, ఆయన స్వరం నుంచి వెలువడిన గీతాలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాల్లో నిర్వహించిన దశకంఠుడు ఎస్పీ బాలు స్వరాభిషేకం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఎస్పీ బాలు గానం చేసిన పలు గీతాలను ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీలతో పాటు పలువురు గాయనీ గాయకులు శ్రావ్యంగా ఆలపించారు.

గాన గంధర్వుడు ఎస్పీ

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సినీ రంగంలో అనేక మంది ప్రముఖ హీరోలకు వారి గొంతులకు అనుగుణంగా పాటలు పాడిన బాలును సినీ ప్రియులు మరిచిపోలేరన్నారు. కేవలం సినీ గీతాలే కాకుండా అనేక ఆధ్యాత్మిక గీతాలు, కీర్తనలను నేటికి భక్తుల మనసుల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. సినీ రచయిత వేటూరు గీతాలపై పరిశోధన చేసిన డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ వేటూరి వంటి ఎందరో మహానుభావులు రచించిన పాటలకు ప్రాణం పోసిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తరువాత ఆ స్థానాన్ని భర్తీ చేసిన ఎస్పీ బాలును గాయక లోకం మరిచిపోదన్నారు. కార్యక్రమంలో జానపద గాయకుడు దామోదర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీశ్వరునికి లక్ష మల్లెల పూజ

నడకుదురు(చల్లపల్లి):నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారికి వేద పండితులు లక్ష మల్లెల పూజ చేసి విశేష అలంకరణ, నక్షత్ర హారతి నిర్వహించారు. దేవస్థానం ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు, దేవస్థానం సమగ్ర అభివృద్ధికర్త మండవ రవీంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రివిక్రమరావు, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, మాజీ ఎంపీటీసీ లంకమ్మ, భక్తులు పాల్గొన్నారు.

రూ.1.66 లక్షలు పలికిన ఆంజనేయస్వామి లడ్డూ

కృత్తివెన్ను: శ్రీఅభయాంజనేయస్వామివారి హనుమజ్జయంతి ఉత్సవాలు సందర్భంగా బుధవారం మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో నిర్వహించిన వేలం పాటలో స్వామివారి లడ్డూ ప్రసాదం రూ.1.66 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన ప్రత్తి రామాంజనేయులు (రాము) వేలంలో రూ.1.66 లక్షలకు హెచ్చు పాటదారునిగా నిలిచి లడ్డూను కైవసం చేసుకున్నారు. గతేడాది రూ.81 వేలు పలుకగా ఈ ఏడాది రెట్టింపు ధరకు రాము పాట పాడుకున్నారు. దాదాపు జిల్లాలోనే అత్యంత ధర పలికిన లడ్డూ ఇదేనని నిర్వాహకులు తెలిపారు. రాముతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కమిటీ వారు సత్కరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

గుడివాడ టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమన్నారు. నేటి అధిక ఉష్ణోగ్రతలకు అడవులు విపరీతంగా నరికి వేయడమే కారణమన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రతి పౌరుడు ఏడాదికి ఒక మొక్కను నాటి అది ఎదిగే వరకు బాధ్యతగా వ్యవహరించినప్పుడు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు సీహెచ్ కుటుంబరావు, బి.లక్ష్మీనారాయణ, సౌదామణి, ఎండీ. ఇక్బాల్, కె.రాంబాబు, కేవీ. ప్రకాష్ పాల్గొన్నారు.



గుడివాడ కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి

నవ సమాజానికి పర్యావరణ పరిరక్షణ

మండవల్లి: నవ సమాజ నిర్మాణానికి పర్యావరణ పరిరక్షణ దోహదం చేస్తుందని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. గ్రంథాలయ విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయం వద్ద మొక్కలు నాటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి చెట్లయ్యే వరకు సంరక్షించి కాపాడుకోవాలన్నారు. కార్తీక్, పవన్, రణధీర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

పర్యావరణం, పరిసరాలపై అవగాహన

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో పర్యావరణం, పరిసరాలపై అవగాహన అవసరమని ఉపాధ్యాయుడు దీవి వంశీ కృష్ణ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పర్యావరణ పరిసరాలను కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. అప్పుడే మానవాళికి ఆరోగ్యకర, ఆనందర కర జీవనం సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి చెట్లను పెంచాలన్నారు. ప్రకృతి పట్ల విధేయతతో మెలగాలన్నారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థులు ఒక బాధ్యతగా స్వీకరించాలన్నారు. అనంతరం విద్యార్థులచేత మొక్కలను నాటించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి నాగ సురేష్, మహిళామండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలువురు ప్రజలకు పర్యావరణం బుధవారం అవగాహన కల్పించారు. ఈ ఏడాది 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు పరిస్థితులు' అనే నినాదంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ఆటపాక పక్షుల విహార కేంద్రం వద్ద అటవీశాఖ రేంజర్ రామలింగాచార్యులు మొక్కలు నాటారు. విద్యార్థులకు పర్యావరణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సూర్యప్రకాష్, బీట్ ఆఫీసర్ కె.వెంకన్న, పర్యావరణ అభివృద్ధి కేంద్రం(ఈడీసీ) చైర్మన్ వడ్లాని సుబ్బారావు పాల్గొన్నారు.



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద మొక్కను నాటుతున్న రేంజర్ నాగలింగాచార్యులు

■ స్థానిక కోర్టు వద్ద మండల లీగల్ సెల్ అథారిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ, ఏపీపీ నాగ ఉదయ, న్యాయవాదులు వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, ఎ.కోటయ్య, ఎ.రాంబాబు, పి.పవన్‌కాంత్, డి.శివ ప్రసాద్ పాల్గొన్నారు.

స్వీప్ ఆధ్వర్యంలో..

కైకలూరు స్వీప్ ఆధ్వర్యంలో పలువురు వృక్ష సంపద మొక్కలను నాటారు. స్వీప్ వ్యవస్థాపకులు న్యాయవాది పి.పవన్‌కాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు సూచించారు.



మండవల్లి గ్రంథాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ భాస్కరరావు



జమీగొల్వేపల్లిలో మొక్కలను నాటుతున్న విద్యార్థులు



కైకలూరు కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు

లోపాలను సరిదిద్దుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం

పామర్రు: సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ప్రభుత్వ లోపాలను అధ్యయనం చేసి వాటిని సరి చేసుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తామని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా పామర్రులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఓటమికి తానే ఈ నియోజకవర్గ కుటుంబ సభ్యుడిగా బాధ్యత వహిస్తామన్నారు. అబద్ధపు వాగ్దానాలను చేసి కూటమి అభ్యర్థులు ప్రజలను తప్పుదోవ పట్టించారని అభిప్రాయ పడుతున్నామన్నారు. కూటమి సభ్యులు చేసిన వాగ్దానాలను ప్రజలకు పూర్తిస్థాయిలో తీసుకెళ్లి ప్రజలకు న్యాయం చేసే విధంగా చూస్తామన్నారు. లేనిపక్షంలో వారిని నిలదీస్తామన్నారు. పామర్రు ఎమ్మెల్యేగా ఎంపికైన వర్ల కుమార్‌రాజా నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానన్నారు. పోలీసులు, జర్నలిస్టులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు, తనకు అన్నివిధాలా సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు పామర్రు నియోజకవర్గ ప్రజల కోసం తన వంతు బాధ్యతగా ఉంటూ వారికి అన్ని విధాలా అండదండగా ఉంటానని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

12న భూముల కౌలు వేలం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠం అమృతేశ్వరస్వామి ఆలయానికి చెందిన చేపలచెరువు భూముల కౌలు బహిరంగ వేలం పాటలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి పీవై నాయుడు బుధవారం తెలిపారు. బావాజీ మఠానికి చెందిన 21.08 ఎకరాల చేపల చెరువు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ చెరువుకు మఠం వద్ద 12న వేలం పాటలు జరుగుతాయన్నారు. ఇదే మఠానికి చేవూరులో 5.40 ఎకరాల పల్లం భూమి ఉన్నట్లు తెలిపారు. దీనికి 12 మధ్యాహ్నం చేవూరు సచివాలయం వద్ద వేలం పాటలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా అమృతేశ్వరస్వామి ఆలయానికి మండలంలోని చేవూరులో 10.79 ఎకరాల పల్లంభూమి ఉన్నట్లు తెలిపారు. దీనిని ఏడాది పాటు లీజుకు ఇచ్చేందుకు చేవూరు సచివాలయం వద్ద 12న మధ్యాహ్నం వేలం పాటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సింగరాయపాలెం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి సింగరాయపాలెంలో నాలుగు ఎకరాలు చేవూరులో 15.74 ఎకరాల పల్లం భూమి ఉందని పేర్కొన్నారు. ఈ భూములకు సైతం సింగరాయపాలెం స్వామి వారి ఆలయం, చేవూరు పంచాయతీ కార్యాలయం వద్ద 12న వేలం పాటలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తగిన దరావత్తు చెల్లించి పాటల్లో పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



లంకపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



అయ్యవారిరుద్రవరంలో పంట కాలువ పనులు చేస్తున్న కూలీలు

పమిడిముక్కల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన 94 పనుల్లో 4,190 మంది కూలీలు పాల్గొన్నారు. పంట కాలువల, చెరువుల తవ్వకం పనులు జరుగుతున్నాయని ఈసీ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఉపాధి పనులతో ప్రజలకు మేలు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఎంటీపీఎస్.నవీన్ పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారి రుద్రవరంలో రూ.79 వేలు ఉపాధి హామీ పథకం నిధులతో బుధవారం 47 మంది ఉపాధి కూలీలు పంట కాలువ అభివృద్ధి పనులను చేశారు. ఈ సందర్భంగా ఎంటీపీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పేద ప్రజలకు పనులు లేని లోటు తీరుతుందన్నారు. రైతుల పంట పొలాలకు కాలువలు బోదెల ద్వారా నీరు సమృద్ధిగా చేరి అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు. చెరువుల ద్వారా ప్రజలకు, పశువులకు తాగునీరు అందడంతో దాహార్తి తీరుతుందని చెప్పారు.

వైఎస్సార్ సీపీకి రెండు ప్రాంతాల్లో మెజార్టీ

గుడ్లవల్లేరు: మండలంలోని రెండు ప్రాంతాల ప్రజలు వైఎస్సార్ సీపీకి మెజార్టీ ఇచ్చారు. గుడ్లవల్లేరు మండలంలోని మామిడికోళ్ల 196వ పోలింగ్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి 231ఓట్లు అక్కడి ప్రజానీకం వేశారు. టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు 165 ఓట్లే వేయగా కొడాలి నానీకి 66 ఓట్లు మెజార్టీ వచ్చాయి. అదే గ్రామంలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావుకు 241ఓట్లు వేయగా జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరికి కేవలం 143 ఓట్లే వచ్చాయి. సింహాద్రి చంద్రశేఖరరావుకు 98ఓట్లు మెజార్టీ వచ్చాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఆ గ్రామంలో వైఎస్సార్ సీపీకి నాయకత్వం వహించిన ఆ పార్టీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్ చిత్తర్వు నాగేశ్వరరావు తమ పార్టీని ఆదరించిన ఓటర్లకు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గుడ్లవల్లేరులోని నెహ్రూనగర్ 190వ పోలింగ్ స్టేషన్‌లో కొడాలి నానీకి 469 ఓట్లు వేయగా వెనిగండ్లకు కేవలం 292ఓట్లు మాత్రమే అక్కడి ప్రజానీకం వేయటంతో కొడాలికి 177ఓట్లు మెజార్టీ వచ్చాయి. స్థానిక ప్రజలకు అదే ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల యువజనాధ్యక్షుడు జి. రవి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి నిశిక వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన తండ్రి బాజీరావు చిన్నారి ఆపరేషన్ సాయానికి దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసుల తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టూ ట్రాఫిక్ సీఐ మహేంద్ర, గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ నాగేంద్రబాబు, బ్రహ్మం హాస్పిటల్‌కు వెళ్లి బాధితురాలు తండ్రి బాజీరావుకు నగదును అందించారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి బాజీరావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు గడ్డివాముల దగ్ధం

గూడూరు: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మండలంలోని కంకటావలో కరిమికొండ రత్నప్రసూనాంబకు చెందిన వరి పొలంలో ఉన్న 10 ఎకరాల గడ్డివామి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. బందరు అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రమాదంలో రూ.75వేల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మండలంలోని పిండివారిపాలెంలో సాయంత్రం పిడుగుపడటంతో పోసిన ఏసుబాబు అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధం అయింది. మచిలీపట్నం అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో దాదాపు రూ.70వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు.



గడ్డివామిపై పిడుగుపడి రేగిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

విద్యార్థులకు పాటల పోటీలు



గ్రంథాలయంలో పాటలు పాడుతున్న చిన్నారి



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.శాంతి మాట్లాడుతూ చిన్నారుల్లో సంగీతంపై శ్రద్ధ కలుగజేసేందుకు ఈ సాంస్కృతిక కార్యక్రమం చేపట్టామన్నారు. పాటలు పాడటంలో మెలకువలు నేర్పించామన్నారు. అలాగే చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో బుధవారం పుస్తక పఠనం చేయించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో పలు రకాల పుస్తకాలను విద్యార్థులకు అందజేసి పఠనం చేయించారు. లెక్కలు సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



పామర్రు గ్రంథాలయంలో అంతరిక్ష పరిశోధన అంశాలను వివరిస్తున్న ఝాన్సీరాణి

పామర్రులో ..

పామర్రు): స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం విద్యార్థులతో తాడు ఆట ఆడించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు. అనంతరం విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన గురించి బోధించామన్నారు. చంద్రయాన్, గగన్‌యాన్, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ తదితరాలను వివరించామన్నారు.

ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

కృత్తివెన్ను: గత ఐదు రోజులుగా మండలంలోని గాంధీనగరం గ్రామంలో జరుగుతున్న శ్రీహనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు ఎంతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, తమలపాకులు, సిందూరార్చనలు జరిపారు. బుధవారం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని సమారాధనలో పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరుకు చెందిన మహాదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు బుధవారం సాయంత్రం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం మామిడాల పావని పర్యవేక్షణలో సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హరిణి, హేమ, వివక్ష, లాస్య, దుర్గా, జయలక్ష్మిల శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

●ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు



ఊయల ఊగుతున్న పిల్లలు

పగటి సమయంలో భానుడి మంటలు, ఉక్కబోతకు తాళలేక వృద్ధులు, చిన్నారులు ఆపసోపాలు పడుతున్నారు. సాయంత్రం చల్లటి వాతావరణానికి ఆటపాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సందడి చేస్తున్నారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయ పార్కులోని చుట్టుపక్కలున్న పిల్లలు చేరి ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.

– గుడ్లవల్లేరు

ఘనంగా రామేశ్వరుని దివ్య కల్యాణోత్సవం



టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని టేకుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ బాల పార్వతీ సమేత రామేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవం బుధవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. శ్రీ కంచి కామకోటి పీఠస్థ ఆలయమైన రామేశ్వరస్వామివారి దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములతో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేద పండితులతో సంప్రదాయబద్ధంగా స్వామివారి ఎదురుకోలు ఉత్సవం, అనంతరం వైభవోపేతంగా దివ్యకల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం వీక్షించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.